# మనిషికో తోడు

ఉపద్రష్ట సాయి



మొదట్లో డాక్టరు చెప్పిన మాటలు నమ్మలేకపోయాడు ఆనంద్. అతనికి సరిగ్గా జబ్బు గురించి తెలియదేమోనని డాక్టరును అనుమానించి మరో డాక్టరు దగ్గరికి వెళ్లాడు. అతను కూడా ఇంచుమించు మొదటి డాక్టరు చెప్పిన మాటలే మరో విధంగా చెప్పాడు. అయినా ఆనంద్ రెండో డాక్టరును కూడా పూర్తిగా నమ్మలేదు. మరో నెల రోజులలో నలుగురు డాక్టర్లకు తన కొడుకు గిరీష్‌ను చూపించాడు. అందరూ ఒకరు చెప్పిన విషయమే మరొకరు చెప్పారు. అప్పటికి గానీ ఆనంద్‌కు వాళ్లు చెప్పిన దాని మీద నమ్మకం కుదరలేదు. ఒక రకంగా చూస్తే డాక్టర్లమాట నమ్మనంత వరకు ఆనంద్ సంతోషంగానే ఉన్నాడు. భార్య జయశ్రీ కూడా "పరవాలేదు. మెల్లగా నయమైపోతుంది" అనుకుంటూ గడిపేది. కానీ, ఎప్పుడైతే అందరు డాక్టర్లు అసలు విషయాన్ని బయట పెట్టారో అప్పుడే ఆనంద్ దంపతుల మొహాలు పాలిపోయాయి. గుండెనిండా గూడు కట్టుకున్న బాధ వాళ్ల మొహాల్లో ద్యోతకమైంది. "ఇప్పుడేం చెయ్యాలి. గిరీష్‌ను ఎలా పెంచాలి" అన్న ప్రశ్నలు వాళ్ల జీవితాల్లో ఉదయించాయి. ఆ ప్రశ్నలకు సమాధాన కూడా డాక్టర్లే చెప్పారు.

"చూడండి... మీ అబ్బాయి గిరీష్ స్పాస్టిక్‌బాయ్. అంటే వాడి శరీరంలోని కండరాలు తగినంత బిగువుగా లేకపోవడం, మెదడులోని కొన్ని జీవకణాలు దెబ్బతినడం, వల్ల తను చెయ్యవలసిన పనులు స్వయంగా చేసుకోలేని పరిస్థితి ఏర్పడడమన్నమాట. దీనినే సెరిబ్రల్ పాల్సీ అని కూడా అంటారు.

"మెదడు దెబ్బతినడం మూలాన, మెదడు శరీరంలోని వివిధ భాగాలకు ఇచ్చే ఆదేశాలు ఆయా భాగాలకు ఇవ్వలేకపోవడం మూలాన, అవి తమ పనులను సక్రమంగా నిర్వహించలేకపోతాయి. ఉదాహరణకు, సెరిబ్రల్ పాల్సీ ఉన్న వ్యక్తి కళ్లు బాగానే ఉన్నా, ఎదురుగుండా ఉన్న వస్తువును చూడాలనే ఆదేశం మెదడు నుంచి కళ్లకు రాకపోవడం మూలాన, ఆ వ్యక్తి వస్తువును చూడలేడు. అలాగే మిగతా భాగాలు కూడా, పని చేయవు. అయితే ఈ పరిస్థితి అందరిలోనూ ఒక్కలాగా ఉండదు. మెదడు దెబ్బతిన్న పరిమాణాన్ని బట్టి, ఆ వ్యక్తి అవయవాలు పనిచేయడం జరుగుతుంది. స్పాస్టిక్‌లో మూడు దశలున్నాయి. మొదటి దశలో మెదడు అతి స్వల్పంగా దెబ్బతింటుంది. అందువల్ల ఆ రకం మనుషులు ఎనభై శాతం మామూలు మనుషుల్లాగే అన్ని పనులూ తమకు తామే చేసుకోగలుగుతారు. రెండవ దశలో మెదడు చాలా వరకు దెబ్బతింటుంది. ఆ కారణంగా, ఆ రకం మనుషులు, మిగతా వారి మీద ఆధారపడి తమ పనులు చేసుకోగలుగుతారు. పోతే, మూడవ దశలో, మెదడు పూర్తిగా దెబ్బతినడం మూలాన, ఆ రకం మనుషులు జీవితాంతం మిగిలిన వారి సహాయంతోనే జీవించగలరు. కానీ, వీరికి తర్ఫీదులు అంటే థెరపీ ఇవ్వడం మూలాన కొంత పురోగమనం సాధించడానికి అవకాశాలున్నాయి."

"అంటే" అడిగాడు ఆనంద్.

"ఇప్పుడు... మీ అబ్బాయి కూర్చోలేకపోతున్నాడు కదా. ఇతన్ని రోజూ ఒక పద్ధతి ప్రకారం కూర్చోబెట్టడం. అతని కాళ్లను, చేతులను కదిలించడం మెల్లగా నిలబెట్టడానికి ప్రయత్నించడం. అలా కొంత కాలం చేస్తే అలవాటు ప్రకారం అతను కూడా కూర్చోడానికి ప్రయత్నిస్తాడన్న మాట. అలాగే అతనిలోని ప్రతి అవయవానికీ అది చెయ్యవలసిన పనులను మనం చేయిస్తాం. 'టేపు' రికార్డరులో పాటలు, మాటలు మళ్లీ, మళ్లీ వేయడం మూలాన, కొంతకాలం తర్వాత అప్రయత్నంగానే అతను వాటిని వింటాడు. విన్నదానికి స్పందించడం తర్వాతి విషయం. అలాగే చేతికి స్పర్శ తెలియడానికి కొన్ని బొమ్మలను చేత్తో పట్టుకునేలా చె

య్యడం ఈ రకంగా థెరపీలు ఇప్పిస్తే సెరిబ్రల్ పాల్సీ లేదా స్పాస్టిసిటీ ఉన్న పిల్లలు కొంత వరకు బాగుపడగలరని చెప్పవచ్చు. కానీ ఈ తర్ఫీదులివ్వడానికి చాలా ఓర్పు కావాలి. ఇది ఒక జీవితకాలం చెయ్యవలసిన పని"

ఆనంద్, జయశ్రీ డాక్టర్లు చెప్పిన దంతా విన్నారు. మొదట్లో డాక్టర్ల మాటలు నమ్మని వాళ్ళు, మెల్లగా ఆ మాటలు నమ్మారు. తమకు అటువంటి బిడ్డ పుట్టినందుకు ఒకరి నొకరు దూషించుకున్నా తర్వాత రాజీపడ్డారు. మొదట్లో బాధపడి కుమిలిపోయినా, మెల్లిగా వాస్తవాలను జీర్ణించుకున్నారు. ఈ పరిస్థితిని ఒప్పుకోక తప్పదని తెలిసిన తర్వాత, తర్ఫీదు లివ్వడానికి నిర్ణయించుకున్నారు. కాలక్రమేణా గిరీష్ - స్పాస్టిక్ బాయ్ అయినా అతన్ని తమ ముద్దుల కొడుకుగా స్వీకరించారు.

ఈ కథంతా జరిగి మూడు సంవత్సరాలైనా, గిరీష్‌లో చెప్పుకోదగ్గ 'ఇంప్రూవ్‌మెంట్' రాలేదు. అతను కేవలం కూర్చోవడం మాత్రమే చెయ్యగలుగుతున్నాడు. మాటలు రాలేదు. తల్లితండ్రులను పోల్చుకోలేక పోతున్నాడు. ఆహారం తినడం తెలియలేదు. జయశ్రీ అతికష్టం మీద ఆహారం పెట్టడానికి గంటసేపవుతుంది. పైగా గిరీష్ వయసు కూడా ఆరు సంవత్సరాలవడం చేత ఎక్కడికైనా వెళ్ళాలంటే అతన్ని మోసుకుపోవడం కష్టమయ్యేది. ఆ కారణంగా, ఆనంద్ దంపతులు మెల్లగా, ఎక్కడికైనా వెళ్ళడం కూడా మానుకున్నారు. పైగా గిరీష్‌కు మాటలు రానందువల్ల అతనికి ఏం కావాలన్నా ఏ కష్టం వచ్చినా ఏడుపు ద్వారా తెలియజేస్తాడు. రోజుకు కొన్ని గంటలు గుక్కత్రిప్పుకోకుండా ఏడవడం మూలాన, జయశ్రీ గిరీష్‌తోనే గడపాల్సి వచ్చేది.

అంతేకాదు, ఒక సమస్య ఉన్న కొడుకు ఆ ఇంట్లో వల్ల, కాలక్రమేణ, చుట్టాలు, స్నేహితులు అక్కడికి రావడం తగ్గించారు. ఎంతోసేపు ఆనంద్ జయశ్రీలు గిరీష్‌తోనే గడిపేవారు వీళ్ళు మరోచోటికి వెళ్ళలేదు. మరొకరు వీళ్ళ ఇంటికి రారు. రోజంతా, జయశ్రీ గిరీష్ బాగోగులు చూస్తూ బ్రతికేది.

జీవితం అంధకారమయమై పోయిందని తనలో తను కుమిలేది. ఒకవైపు థెరాపీలు జరుగుతున్నా మరోవైపు చుట్టుప్రక్కల వాళ్ళు పూజలు, తాయెత్తులు అంటూ ఏం చెప్పినా వాటిని వెంటనే చేసేది. అడపా దడపా ఆనంద్ భార్యకు నచ్చచెప్పేవాడు, పూజలు, పునస్కారాలు చెయ్యడం వల్ల గిరీష్ నయమవుతాడనుకోవద్దనీ, అయినా అవి చెయ్యడం తప్పుకాదు... కానీ... మనిషి బలహీనతను ఆసరాగా తీసుకుని కొందరు 'ఎక్స్‌ప్లాయిట్' చేస్తారని హెచ్చరించేవాడు. అలాగే జోస్యులకు, చక్రాలు వేసే వాళ్ళకు కూడా గిరీష్ జాతకాలను చూపించేది జయశ్రీ, ఆనంద్ మాటలు విన్నట్లు నటించినా తన పని తను చేసేది. ఒక్కొక్కప్పుడు



**బరువు**


"మీరు కొన్నాళ్ళు పాటు బరువుల జోలికి పోకూడదు" అన్నాడు ఆమెకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిన డా. ప్రసాద్.

"అంటే నేను 'లంచాల' జోలికి పోకూడదా డాక్టర్?" అని టక్కున అడిగింది చెక్‌పోస్టులో పని చేస్తున్న నక్కుబాయి.

—గీత-గుంటూర్.

ఆ విషయం మీద భార్యాభర్తల మధ్య ఘర్షణలు వచ్చేవి.

"చూడండి! మీరు చెప్పిన వాటిని నేను కాదనడం లేదు. నాకు వివేకం ఉంది. తెలివితేటలున్నాయి. పరిస్థితులు అర్థం చేసుకోగలను. కానీ పేగు తెంచుకుని కన్న ఒక్కగా నొక్క కొడుకు,




ఏనాటికైనా బాగుపడుతాడనే నమ్మకంతో... ఒకవేళ నేను చేసిన పూజలవల్లో, ఇప్పించే థెరాపీ వల్లో. దేనివల్లనైనా అతనికి నయమైతే చాలని వాటిని చేస్తున్నాను. నవమాసాలు... మోసాఆనండీ.. నమ్మకంతో మోసాను. మనకొక మంచి బిడ్డపుట్టాలని... తీరా ఇలాంటి బిడ్డ పుట్టిం తర్వాత... వాడి చేత కనీసం ఒక్కసారి.... అమ్మా అని కాకపోయినా 'నాన్నా' అని పిలిపించి... మీ కళ్ళలో సంతోషాన్ని చూడాలని నా తాపత్రయమండీ... అంతే... మీరెన్ని తిట్లైనా తిట్టండి... పడ్తాను.." అంది జయశ్రీ.

భార్య మాటలకు ఆనంద్ కళ్ళు చెమ్మగిల్లాయి పాపం... తల్లి మనసు... ఒక్కగానొక్క బిడ్డ కోసం ఎంత పరితపిస్తుందో అర్థం చేసుకున్నాడు. తరువాత భార్య, గిరీష్ కోసం ఏం చేసినా జోక్యం చేసుకునే వాడుకాదు.

ఒకవైపు ఉద్యోగం చేస్తూ, మరో వైపు కొడుకు, భార్యల గురించి ఆలోచిస్తూ బాధపడుతూ గడిపేవాడు ఆనంద్. ఆఫీసులో "ప్రమోషన్'లు వచ్చినా, బిడ్డకోసం వద్దనేవాడు. ప్రమోషనంటే, బదిలీ వస్తుంది. బదిలే అయితే, మరో పూరు వెళ్లాలి. అక్కడ బాబుకు ట్రీట్‌మెంట్ వసతులు అందుబాటులో ఉండాలి. పైగా కొత్త వూళ్లో తనకు ఏసమస్య వచ్చినా ఆదుకునే వాళ్లు తెలియదు. ఇక్కడైతే, వాళ్లు తన ఇంటికి రాకపోయినా, తనకు సహాయం కావాలంటే వెళ్లి అడగడానికైనా కొందరున్నారు. అంతేకాదు.. ఆనంద్ మంచి రచయిత కూడా. ఒకప్పుడు ఎన్నో పత్రికలలో నవలలు, కథలురాసేవాడు. కానీ, గిరిష్ పుట్టిం తర్వాత రచనా వ్యాసంగం కుంటుపడింది. మంచి రచయితగా గొప్పపేరు తెచ్చుకుంటున్న సమయంలో, రచనల పట్ల విముఖత చూపించవలసిన పరిస్థితి వచ్చినందుకు బాధపడినా పరిస్థితులతో రాజీపడ్డాడు. ఒకప్పుడు, నగరంలో ఎన్నో సభలకు, సమావేశాలకు తనను పిలిస్తే తప్పకుండా వెళ్లేవాడు, ఆనంద్. కానీ కాలక్రమేణా అటు సభలకు వెళ్లడం, రచనలు చేయడం మెల్ల మెల్లగా తగ్గిపోయాయి. ఆర్థికంగా తనుక్రిందికి రావడం జరిగింది.

ఉద్యోగం మాత్రం తన జీవనాధారమైంది.

మరో గత్యంతరం లేదు కనుక, ఇంట్లో భార్య, కొటుకుతో ఎన్ని కష్టాలు పడుతున్నా గుండె రాయ చేసుకుని ఉద్యోగానికి వెళ్లి వచ్చేవాడు ఆనంద్.

ఆఫీసులోనూ, ఇంట్లోను నాలుగు గోడల మధ్య బంధించబడిన జీవితాన్ని గడిపేవాడు.

తన ధ్యేయం ఒక్కటే..కొడుకును తన పనులు తాను చేసే స్థాయికి తేవడం. దానికోసం.. ఎన్ని సుఖాలనైనా త్యాగం చెయ్యడానికి సిద్ధపడ్డాడు ఆనంద్...అతనితోబాటు భార్య జయశ్రీ, కాల చక్ర గమనంలో మరో రెండు సంవత్సరాలు దొర్లిపోయాయి. గిరీష్‌లో మార్పు రాలేదు. కాకపోతే, వెస్టరన్ మ్యూజిక్ మాత్రం వినేవాడు. అతని గదిలో ఇరవై నాలుగు గంటలూ 'టేపు రికార్డర్' పనిచేస్తూ ఉండాలి. ఆగితే అతనికి కోపం

వస్తుంది.. ఏడుస్తాడు.

తమ శ్రమకు తగ్గ ఫలితం కనిపించకపోవడంతో ఆనంద్ దంపతులు కృంగిపోయారు. పైగా, కొడుకు భవిష్యత్తు ఏమవుతుందో అనే ఆవేదన నానాటికీ ఎక్కువైంది. తాము ఉన్న వాళ్లు కొడుకు బాగోగులు చూస్తాం. తరువా..గిరీష్ ఏమవుతాడు? వాడిని ఎవరు సంరక్షిస్తారు? వాడికి తోబుట్టువులు కూడా లేరు. ఉన్నా ఈ రోజుల్లో, మానసిక వికలాంగుల కోసం, జీవితాలను త్యాగం చేసే వాళ్లెందరుంటారు? రోజు గడవడం...ఎంతకష్టమో, ఈ ప్రశ్నలకు సమాధానాలు దొకరడం కూడా అంత కష్టమే.

పెరుగుతున్న వయస్సు. అటు ఆఫీసులోనూ..ఇటుఇంట్లోనూపడుతున్న శారీరక, మానసిక శ్రమ ఫలితంగా ఆనంద్ ఆరోగ్యం దెబ్బతింటూంది. అయినా ఆత్మబలం..గుండె ధైర్యం అతన్ని మనిషిగా నడిపిస్తున్నాయి.

జయశ్రీ పరిస్థితి అంతకన్నా హీనమైనది.

ఇంట్లో నాలుగ్గోడల మధ్య యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తూంది. ఆమె ఆరోగ్యం బాగా క్షీణించింది. కానీ ఎన్నడు తను, దెబ్బతిన్న ఆరోగ్యం గురించి ఆనంద్‌తో చెప్పలేదు. చెబితే అతను మరింత బాధపడుతాడని జయశ్రీ భయం.పైగా ఇప్పటికే 'గిరీష్'కు కొన్ని మందులు,




ప్రతిపక్ష అభ్యర్థి

*"పార్వతిగారూ! మీ భర్తను తిట్టినా, కొట్టినా ఏమీద చేయి చేసుకోరు ఎందుకు" అడిగింది పక్కింటి పాపాయమ్మ.*

*"అరే, మీకు తెలియదా? మావారు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే కదండీ!" జవా బిచ్చింది పార్వతి.*

పట్నం శేషంశెట్టి [నంద్యాల]



పరికరాలు, చక్రాల కుర్చీ బూట్లు ఇలా ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఖర్చులు వస్తున్నాయి. ఆనంద్ జీతం...ఆ ఇంటికి చాలడం లేదు. అటువంటి పరిస్థితిలో తన గురించి చెబితే..ఆనంద్ కుమిలిపోతాడేమో ననుకుంది జయశ్రీ.

కానీ ఆనంద్..తెలివైన వాడు.. చెప్పకుండానే పరిస్థితి అర్థం చేసుకోగలడు. నానాటికీ దిగజారుతున్న జయశ్రీ ఆరోగ్యంఆనంద్ మనసులో ఆందోళన రేపింది. ఇప్పుడు గిరీష్ ఆరోగ్యం కన్నా జయశ్రీ ఆరోగ్యం ముఖ్యం. ఆమె బాగుంటేనే అంతో ఇంతో సహాయం చేయడానికి ఒక మనిషి కావాలి. మరి మనిషంటే.. అంత తేలికగా దొరుకుతారా? అలా దొరికినా నెల నెలా జీతం క్రింద ఎంతో కొంత డబ్బివ్వాలా? అంతటితోసరా? ఆ వ్యక్తికి భోజనం ...టిఫిన్..సోపులు..పౌడర్లు వగైరా వగైరాలు అన్నీ ఏర్పాటు చెయ్యాలి. ఎంత లేదన్నా నెలకు ఐదు వందలైనా ఖర్చవక తప్పదు. మరి మరో మార్గం కూడా ఆనంద్‌కు కనిపించలేదు.

ఆఫీసులో మేనేజరును ప్రాధేయపడి ఓవర్ టైము చేయవచ్చు. కాస్త కష్టపడితే రాత్రిళ్లు ఒకటిరెండు కథలు రాయవచ్చు. సంపాదకులు కరుణిస్తే ఒక నవల రాస్తే కనీసం ఆరునెలలు పనిమనిషిని భరించవచ్చు. తప్పదు. తన చేతి కష్టం తప్పదు. మరో దారి లేదు. అనుకున్నాడు ఆనంద్.

వేట ప్రారంభమైంది.

ఎందరో వచ్చారు. రెండురోజులు, మూడు రోజులు, వారం రోజులు అంటూ వుండిపోయారు. "ఈ నాలుగ్గోడల బందిఖానా మాకొద్దు బాబూ" అంటూ వెళ్ళిపోయారు.

మళ్ళీ మామూలే. ఆనంద్, జయశ్రీలే మిగిలారు.

రాత్రిళ్ళు సరిగ్గా నిద్రలేక జయశ్రీ మరీ నీరసించిపోయింది. ఆనంద్ సెలవుపెట్టి గిరీష్‌ను చూసుకునే పరిస్థితి వచ్చింది.

శారీరకంగా, మానసికగా కృంగిపోయిన ఆ దంపతులు, ఒకానొక బలహీనమైన తరుణంలో, "భగవంతుడా! మా బాబును తీసుకుపోకుడదూ- అటు వాడికీ సుఖం లేదు. ఇటు మాకూ సుఖం లేదు." అనుకున్నారు. భోరుమని ఏడ్చారు. తర్వాత సర్దుకున్నారు. కానీ ఈ సృష్టిలో చావు పుట్టుకలు ఎవరి చేతుల్లోనూ లేవు. చావు రమ్మంటే రాదు. వద్దంటే రాకమానదు. కాలం తీరిపోయేదాకా బ్రతికి తీరాలి- అందుకే గిరీష్ బ్రతికే వున్నాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఒక ఆదివారం మధ్యాహ్నం ఆనంద్ ఇంటికి ఒక నడి వయస్కురాలు వచ్చింది. ఆమె వయసు ముప్ఫై సంవత్సరాలు వుంటాయి. మనిషి దృఢంగా వుంది.ఛామనచాయ. పొడగరి. తన పేరు కామాక్షి అని పరిచయం చేసుకుంది. మాట మెత్తగా వుంది. ఆకారానికి, మనిషి మాటకీ పొంతన లేనట్లుంది. వీర్రాజు అనే ఆనంద్ స్నేహితుని ద్వారా, ఆనంద్ ఇంటికి పనిమనిషి కావాలన్న విషయం తెలుసుకుని వచ్చిందని చెప్పింది కామాక్షి.

పని మనుషులంటే ఆనంద్ దంపతులకు నమ్మకం పోయింది. ఎందరో వచ్చారు. పోయారు. ఈవిడెంత కాలం వుంటుందో అనుకుంటూ, అంత వరకు వారికి జరిగిన అనుభవాలను పూసగుచ్చినట్లు చెప్పారు.

"కనుక, నువ్వు తప్పకుండా వుంటానంటే వుండు. వెళ్ళిపోయే వుద్దేశ్యం వుంటే వెళ్ళిపో.. కానీ ఈ ఇంట్లో వున్న అబ్బాయి మానసిక వికలాంగుడు. వాడి పనులు నువ్వు చేయనక్కర్లేదు. వంటపని, పై పనులు చేస్తే చాలు. ముఖ్యంగా అమ్మగారికి రెస్ట్ కావాలి. నువ్వు ఆ పనులు చేస్తే ఆవిడ గిరీష్ పనులు చేస్తుంది" అన్నాడు ఆనంద్.

కామాక్షి అన్నిటికీ తలూపింది.

అంతేకాదు.

గిరీష్ పనులు కూడా చేస్తానని ఉత్సాహంగా చెప్పింది. ఆనంద్ దంపతులకు ధైర్యం చెప్పింది. చూస్తూ చూస్తూ వారం రోజులు దొర్లిపోయాయి. కామాక్షి ఆ ఇంట్లో ఒక మనిషై పోయింది. జయశ్రీకి కామాక్షి తోడ బుట్టిన సోదరిలా అనిపించింది. అనురాగ పూరితమైన కామాక్షి మాటలు జయశ్రీకి ఉపశమనం కలిగించాయి.

స్పాస్టిక్ కుర్రవాళ్ళ తల్లితండ్రులకు, అనురాగం, అభిమానం నిండిన వారి ఓదార్పు పలుకులు ఎంత ఊరట కలిగిస్తుందో ఆ దంపతులు

తెలునుకున్నారు. కానీ సాధారణంగా అటువంటి కుటుంబాలకు దూరంగా వుండాలనే చాలా మంది అనుకుంటారు. గానీ, వారితో వుండాలని ఎవరోగానీ అనుకోరు.

కామాక్షి ఆ కొందరిలో తాను ఒకతె అనిపించుకుంది.

ఆనంద్‌కు కూడా కామాక్షి ఆ ఇంట్లో వుండడం వల్ల కొంత తీరిక దొరికేది. ఆ సమయంలో కథో నవలో తొందర తొందరగా రాసేవాడు.

కాల చక్రం తిరిగింది.

ఆరునెలలు గడిచాయి.

ప్రతినెల కామాక్షికి రెండువందల రూపాయలు జీతం ఇచ్చేవాడు ఆనంద్. ఆ డబ్బు ఏం చేస్తుందో అని అతని సందేహం.

ఒక రోజు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి జయశ్రీ, కామాక్షి ఇద్దరూ విచారంగా కనిపించారు. అది మామూలే. గిరీష్ విపరీతంగా ఏడ్చుంటాడని ఆనంద్‌కు తెలును. కానీ ఆనాడు మాత్రం ఎందుకో అతనికి అలా అనిపించలేదు.

"ఏమైంది" కంగారుగా అడిగాడు ఆనంద్.

"గిరీష్ ఒళ్ళు పెట్టిపోయింది. జ్వరం తీవ్రంగా వుంది. డాక్టరు దగ్గరికి తీసుకు వెళ్ళాము. మందులిచ్చి, ఇంజక్షన్ చేశారు. నిద్రపోతున్నాడు". గుక్క తిప్పుకోకుండా చెప్పింది జయశ్రీ.

ఇప్పుడేం.. చెయ్యడం. అనుకున్నాడు ఆనంద్.

"ఏమీ చెయ్యలేము." అంది జయశ్రీ.

జయశ్రీ కన్నా కామాక్షి మరింత విచారంగా కనిపిస్తూంది.

ఆ రాత్రి వాళ్ళు నిద్రపోలేదు. మర్నాడు కూడా గిరీష్ జ్వరం తగ్గలేదు. మూడు రోజులకు మందులు రాసిచ్చారు. కనుక మళ్లీ మర్నాడే వెళ్లడం ఎందుకు అనున్నారు ఆనంద్ దంపతులు

మూడో రోజు ప్రొద్దున్న గిరీష్.. మరణించాడు.

అంతవరకు అష్టకష్టాలు పడినా, తమ గారాల బాబు.. ముద్దుగా.. బొద్దుగా కనిపించే బాబు.. చనిపోయాడని తెలిసినపుడు ఆనంద్ దంపతులు వదే వదే విలపించారు.

కామాక్షి వారి కన్నా ఎక్కువ బాధపడింది. తర్వాత ఆనంద్‌ను జయశ్రీని ఓదార్చింది కూడా.

మరో వారం తిరిగింది.

ఇప్పుడు ఆనంద్ దంపతులకు కొత్త ప్రశ్న ఉదయించింది. "కామాక్షి కావాలా" అనే ప్రశ్న.

"ఇంకెందుకు" అంది జయశ్రీ.

అయినా వాళ్లకెందుకో కామాక్షి తమతోనే ఉంటే బాగుండునని పించింది.


మర్నాడు 'కాఫీపొడి' విసిరించుకు రావడానికి వెళ్లినపుడు కామాక్షి గది దగ్గర ఒక కాయితం కనిపించింది జయశ్రీకి. ఏమిటా అని చూసిన ఆమెకు ఆశ్చర్యం కలిగించింది- మరుక్షణం జయశ్రీ కళ్లూ చెమ్మగిల్లాయి. కామాక్షి నెలనెలా తన జీతాన్ని మానసిక వికలాంగుల సంక్షేమ కేంద్రంలో ఉన్న కన్న కూతురి జీతం కోసం, హైదరాబాద్ పంపిస్తూంది. భర్త చనిపోయాడు. కూతురు మానసిక వికలాంగురాలు. తన జీవనాధారం కోసం ఇక్కడ పనిచేస్తూ తన కూతురి భవిష్యత్తును సంక్షేమ కేంద్రంలో ఉంచింది. పాపం... ఒక వికలాంగురాలి తల్లిగా ఆ బిడ్డను రక్షించడానికి మరో ఆధారంలేని కామాక్షి తన కథ చెప్పకుండా అంతటి దావానలాన్ని తనలో దాచుకుంటూ, ఆనంద్ దంపతులకు ఉపశమనాన్ని కలిగించింది. కామాక్షి గురించి ఆలోచించిన జయశ్రీకి ఒక రకంగా, "కామాక్షి కన్నా తామే నయం".. అనిపించింది.

అందుకే మరోసారి "కామాక్షి కావాలా" అని ఆనంద్ అన్నప్పుడు.. "ఔనండీ... నా ఆరోగ్యం... బాగులేదు.. మనతోనే ఉండనివ్వండి" అంది జయశ్రీ...

మరో వారం తర్వాత 'నిజం' చెప్పింది జయశ్రీ.

ఆనంద్ నిశ్చేష్టుడయ్యాడు.

కామాక్షి మాత్రం.. తన 'రహస్యం' ఇంకా వారికి తెలియలేదనుకుంది.




నత్త నడక నడుస్తూ మరో వారం గడిచిపోయింది. ఆ ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఏర్పడింది. పగలైనా, రాత్రైనా నిశ్శబ్దం తాండవిస్తూంది. ఆనంద్ దంపతులను మొదటి కొన్ని రోజులు గిరీష్ లేని వెలితి కలవర పెట్టాయి. కాలక్రమేణ వారికి తగిలిన గాయం మెల్లగా ఆరుతుందనుకుంది కామాక్షి. నిజానికి కామాక్షి మనసు కూడా బాగా దెబ్బతిన్నది. కానీ "ఆ ఇంట్లో తను మూడో మనిషి. హద్దులు దాటి ఏ విషయంలోనూ జోక్యం చేసుకోవడం న్యాయం కాదు" అనుకుంది కామాక్షి. అయినా ఒక బాధ్యత గల పని మనిషిగా, అంతకు మించి శ్రేయోభిలాషిగా కొంతవరకు వారికి ఊరట కలిగించడానికి ప్రయత్నించింది. అంతే.

అంత వరకు ఆ ఇంట్లో గిరీష్ ఏడుపులు, కేకలు, వాటితో బాటు అతని చాకిరీ, జయశ్రీ, ఆనందులకు అలవాటై పోవడంతో ఇప్పుడు అతను లేకపోవడం చాలా వెలితిగా అనిపించింది. రాత్రిళ్ళు గిరీష్ ఏడుస్తున్నట్లు భ్రమ పడే వాళ్ళు వారు. కాలం గడుస్తున్నా ఎందుకో గిరీష్‌ను మరిచిపోలేక పోయారు వాళ్ళు.

పైగా కామాక్షికి సంబంధించిన ఒక నిజం కూడా వారికి తెలియడం మూలాన వారిలో కొత్త ఆశ చిగురించింది.

ఈ సమాజంలో చెడ్డమంది ఎందరో ఉన్నా నూటికో, కోటికో ఒక మంచి మనిషి కూడా వుంటాడు. కొన్ని సంవత్సరాలుఒక మానసిక వికలాంగుడితో కష్టపడినా, మళ్ళీ మరో మానసిక వైకల్యం ఉన్న బిడ్డను తమ ఇంటికి తీసుకు వస్తే గానీ వారికి తృప్తిగా ఉండదని భావించారు వాళ్ళు. కామాక్షి కూతురు ఎక్కడో మానసిక వికలాంగుల సంక్షేమ కేంద్రంలో ఎందుకు ఉండాలి? అంత ఉత్తమురాలైన తల్లికి దూరంగా ఆ బిడ్డ ఎందుకు బ్రతకాలి?అని కూడా వాళ్ళు అనుకున్నారు.


'కామాక్షి తమ కుటుంబానికి చేసిననిష్కల్మషమైన సేవకు ప్రతిఫలంగా కామాక్షికి ఏమి చేసినా, ఎంత చేసినా ఋణం తీరదు! అనుకున్నారు ఆనంద్ దంపతులు. ఆనంద్, జయశ్రీ పరస్పరం కామాక్షి కూతురి గురించి చర్చించుకుని, ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ పాపను, తమతో ఉంచుకుని పెంచాలనేదే ఆ నిర్ణయం. రెండు రోజుల తర్వాత గురువారం సాయంత్రం, ఆనంద్ తన నిర్ణయాన్ని కామాక్షికి చెప్పాడు. జయశ్రీ కూడా ప్రక్కనే ఉంది.

వారి మాటలు విన్న కామాక్షి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కళ్ళలో నల్ల జీరలు కనిపించాయి. గద్గద స్వరంతో మాట్లాడపోయింది. నోటమాట పెగల్లేదు. తన తోబుట్టువులే తనను ఆదరించని సమయంలో మరో దారి లేక మరొకరింట్లో పని

చేయడానికి వచ్చింది తను. ఆనంద్.. తనకు బంధువు కాదు. జయశ్రీ తన తోబుట్టువు కాదు. వారితో తనకే విధమైన బాంధవ్యం ఉందంటే... కేవలం మానవత్వం కలిపి ముడి వేసిన బాంధవ్యం మాత్రమే ఉంది. ఆ బాంధవ్యమే, ఒక ఉన్నత సంస్కారం.... దయగల భార్యా భర్తలను తనకు శ్రేయోభిలాషులుగా ప్రసాదించింది.

ఈ సృష్టిలో ప్రతి మనిషికీ ఎవరో ఒకరు చేయూతనివ్వడానికి ఉంటారు. వాళ్ళు ఆ మనిషి తోబుట్టువుల్లో, బంధువుల్లో కానక్కర్లేదు. దైవం... మానవ రూపంలో వచ్చి సహాయం చేయవచ్చు... నమ్ముకున్న వారికి. కామాక్షి జీవితంలో ఆనంద్ దంపతులు, దైవ సమానులయ్యారు... ఆ క్షణంలో.

కొద్ది క్షణాల తర్వాత మెల్లగా చెప్పింది కామాక్షి. “మీ రిద్దరూ చాలా గొప్పవాళ్ళు.. మానవత్వంగల ఐశ్వర్య వంతులు. మానసిక వైకల్యంగల ఒక బిడ్డతో కొన్ని సంవత్సరాలు ఎంతో కష్టపడి, లేత వయసుగల బిడ్డను పోగొట్టుకున్న దురదృష్ట వంతులు. మీ ఇంట్లో కేవలం పని చెయ్యడానికి వచ్చిన నన్ను ఆదరించి, అభిమానం చూపిన ఉత్తములు. కానీ... ఇన్నేళ్ళు మీరు జీవితంలో ఏమీ అనుభవించలేక పోయారు. కష్టాలు తప్ప. దాంపత్య జీవితంలోని మాధుర్యాన్ని కూడా కొంతైనా చవి చూడలేని పరిస్థితిలో గడిపారు. మీకింకా ఎంతో కాలం అనుభవించడానికి ఉంది. గిరీష్ పోయాడని బాధపడుతూ కూర్చోవద్దు. అది కూడా భగవంతుడి నిర్ణయమే. మళ్ళీ ఒక మంచి సంతానం పొందేలా, దాంపత్య జీవితాన్ని గడపండి. మీ లాంటి మంచి వారికి ఒక వారసుడు కావాలి.మీ కోసం కాకపోయినా... మీ మంచితనాన్ని మీ తర్వాత ప్రపంచానికి తన ద్వారా... తన చేతల ద్వారా చాటడానికి. లేక పోతే ఈ లోకంలో మానవత్వం నిండిన మనుషులు కరువైపోతారు.



### గ్రీటింగ్స్

పెళ్లికొడుకు పోస్ట్‌మాన్‌తో: నా పేర్న మారేజ్ గ్రీటింగ్స్ ఏమైనా వచ్చాయా?

పోస్ట్‌మాన్: వచ్చాయి కానీ, అవి మీకు కాదు. పాతికేళ్ల క్రితం జరిగిన మీ నాన్నగారి పెళ్లికని పంపినవి.



### స్ట్రిక్టా?

ఒకడు: ఏమిటీ, మీ ఆఫీసరు చాలా స్ట్రిక్టా? ఎలా?

రెండోవాడు: ఆఫీసులో అంతా ఒకేసారి నిద్రపోకుండా - వంతులవారీగా నిద్రపోవాలని స్ట్రిక్ట్ ఆర్డర్స్ జారీ చేశాడు.

శ్రీ రాచమూర్తి [అశ్వాపురం]

“పోతే.... నా పట్ల మీరు చూపించాలనుకున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నా బిడ్డను ఇక్కడ తెచ్చి మీతో బాటు ఉంచుకుని పెంచుదామనుకున్న మీ నిర్ణయం... మంచిదే.. అయినా, మీరు మీకంటూ మరో బిడ్డను కని పెంచితే... ఆ పెంపకం బాధ్యత నాకే ఇస్తే మీరు చేసిన, చేస్తున్న సహాయానికి రుణం తీర్చుకున్న దాన్నవుతాను. అంతేకాదు.. మీరు చెయ్యడానికి ముందుకు వచ్చిన ఈ సహాయాన్ని.. అది సహాయం కాదని మీరు భావించినా, నేను స్వీకరించలేదనుకోవద్దు. నాకంటూ మీరు చెయ్యవలసిన సహాయం ఒకటుంది... చెప్తే చేస్తారా?” చెప్పడం ఆపి అడిగింది కామాక్షి.

జయశ్రీ ఆనంద్‌లు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. తరువాత “తప్పకుండా” అన్నారు.

“నన్ను మాత్రం. పనిలో నుంచి తీసేయకండి. నా బిడ్డను బ్రతికించడానికి నాకు ఈ పని కావాలి. ఇదే మీరు నాకు చేసే గొప్ప సహాయం.. అలాగే మరో సహాయం.. త్వరలో మీరు మరో సంతానాన్ని పొందాలి.. ఆ బిడ్డను నేనే పెంచాలి” అంది కామాక్షి.

సహాయం కోసం అర్థించే వాళ్లే ఎక్కువగా ఉన్న ఈ సమాజంలో, ఎవ్వరు చేయడానికి ముందుకు రాని సహాయం చేస్తామని... ముందుకు వచ్చినా,

ఎంతో సహృదయతతో, నిస్వార్థంగా, ఆ సహాయాన్ని వద్దనే వాళ్లెందరుంటారు! అంతేకాదు.. తను పనిచేస్తున్న ఆ ఇంట్లో ఆ దంపతులు మరో బిడ్డను కని ఆనందంగా వుండాలని ఆకాంక్షించే వాళ్లెందరుంటారు.?

ఎందరున్నా లేకపోయినా తాను ఉన్నానని చెప్పింది కామాక్షి. ఆ మాటలకు నిశ్చేష్టులై నిలబడ్డారు ఆనంద్. జయశ్రీలు.

ఈ మారు.. కంట తడిబెట్టడం ఆనంద్ దంపతుల వంతైంది.

★

